# ఎండ

## రాచకొండ విశ్వనాథశాస్త్రి

'కలకంఠి' కథల సంపుటి నుండి

వూరి చివర. (కిందటేడు వ్యాపారం గురించి కలకత్తాకి వెళ్తూ వెళ్తూ దార్లో అకస్మాత్తుగా చచ్చిపోయిన) మసూరి పాతమొఖాసాదార్ గారి తోటలో ట్రంకురోడ్డుకి పక్కగా, చీకటిమర్రి చెట్టుకింద ఒంటిగా నిల్చున్న పాడుపడ్డ గదిలో కాపరం ఉంటూ, ఊళ్ళో ఇంటింటికి తిరిగి తిరిగి అప్పడాలు ఒడియాలు అమ్ముకు బతికే శారదమ్మగారి ఆరేళ్ళ కూతురు — సుందరం — ఓ రోజు సాయంకాలం వాళ్ళమ్మని,

"అమ్మా అమ్మా! ఎండెప్పుడొస్తుందమ్మా?" అని అడిగింది.

సాయంకాలం చాలా చీకటిగా చాలా భయంగా మరో ఘడియలోనో క్షణంలోనో మనింటికి రాబోయే చావులా ఉంది. మూడ్రోజులపాటు మన్నూ మిన్నూ ఏకమైపోయి నట్టనిపించింది. ఇవాళ నాలుగో రోజు ఉదయానికి కాస్త తెరపిచ్చిందే కాని, ఆకాశం మాత్రం రవ్వంత మేరయినా విడకుండా మబ్బుతో దట్టంగా మూసుకుపోయేఉంది. వర్షంతోపాటు ఈ మూడ్రోజులూ చలిగాలికూడా ప్రచండంగా వీచివీచి నానా బీభత్సం చేసింది. ఈ రోజు మాత్రం గాలిబాగా సద్దుమణిగింది. శారదమ్మ గది వెనకనున్న పాతతోటలో చెట్లన్నీ కూడా పగవాడు తెరిపివ్వకుండా తీసిన పిడుగుదెబ్బకి తట్టుకోలేక చెల్లాచెదురైపోయి అలిసిపోయి మరింక కదల్లేక శవాల్లా ఉండిపోయిన బీదవాళ్ళకోటలోని పేదజనంలా ఉన్నాయి.

"అమ్మా! ఎండెప్పుడొస్తుందమ్మా?" అని అడిగింది సుందరం.

కూతురు వేసినప్రశ్న శారదమ్మ వినిపించుకోలేదు. ఆవిడ, ఆ కిటికీల్లేని చీకటిగదిగుమ్మం ముందున్న సన్నపాటి నడవలో కూర్చొని, పాత హరికెన్‌లాంతరుచిమ్నీ బీటలు విడిపోకుండా నెమ్మదిగా భద్రంగా తుడుస్తోంది.

సుందరం తన ఆరేళ్ళజీవితంలోనూకూడా ఇంతగాలీవర్షం ఎన్నడూ ఎరగదు. మొదటిరోజున సరదా పడ్డది కాని రెండో రోజు రాత్రికల్లా ఆ పిల్లకి భయం పట్టుకుంది. మూడోరోజల్లా ఈవర్షం మరింక తగ్గదు కాబోలు, ఎండ మరింక రాదు కాబోలు అనుకొని బెంగపెట్టేసుకొని ఏడుస్తూ కూర్చుంది. ఈ రోజు పొద్దున్నించీకూడా వర్షంలేకపోవడంతో ఆమెకొంచెం ధైర్యం వచ్చింది. కాని, ఎండ తప్పక రేపొస్తుందని అమ్మకూడా చెప్తే కాని ఆ పిల్లకి పూర్తిగా నమ్మకం కుదరదు.

"అమ్మా! ఎండమ్మా ఎండ! ఎండ ఎప్పుడొస్తుందమ్మా?" అని మళ్ళీ అడిగింది సుందరం.

సుందరానికి ఎండంటే ఎంతో ఇష్టం.

వాళ్ళ నాన్న పైనింకా ఉన్నప్పుడు, రెండేళ్ళ కిందట, కార్తీక మాసంలో వాళ్ళనాన్నతోనూ అందరితోనూ కలిసిసుందరం వనసంతర్పణకి వెళ్ళింది. నాన్నతో మిల్లులో పన్జేసే ముగతా పనివాళ్ళూ, వాళ్ళఆడవాళ్ళూ, పిల్లలూ అంతాకూడా వచ్చేరారోజున. బంగారం లాంటి ఎండని సుందరం ఆ ఒక్కరోజే చూసింది. అక్కడ కొండవార రాజుగారి పువ్వులతోటలో అంతా చీకటితోనే వెళ్ళి దిగి అక్కడే వండుకొని తినుకొని ఆడుకొని పాడుకొని రోజు రోజల్లాహాయిగా గడిపేరు.

ఆవేళ పొద్దున్నే కొండ మీంచి నెమ్మదిగా కిందికిజారిన ఎండ నీలపు పొగమంచుతో కలిసిపోయి నెమ్మదిగా పురివిప్పగా మెరిసే నెమలి పింఛంలా మెరిసింది మరి కొంతసేపటికి ఆయెండే ముద్దుగా విడుకున్న గులాబి పువ్వులతోటలో ఎర్రగా విరిసింది. పదిగంటలకి ఎండ వెచ్చవెచ్చగా ఉంటూ కమ్మగా వండిన వంటవాసనల్తో కలిసిపోయి అన్నం తినిపించే అమ్మచూపులా హాయిగా ఉంది. పన్నెండు గంటలకి చెట్లఆకుల్లోంచి పల్చపల్చగా కిందకి జారిన ఎండ పౌర్ణమినాటి అర్ధరాత్రి పండు వెన్నెల్లా సుఖంగా ఉంది. చెట్లకింద కొత్తతాటాకు చాపమీద వెల్లకిలా పడుకున్న సుందరానికి పైనున్న లేతాకులన్నీ ఆకుపచ్చగాజుతో నాజూగ్గా చెక్కిన గాజాకుల్లా వింతగా కనిపించేయి. ఒంటిగంటకి బాగా తళుకెక్కిన ఎండ కొత్త వెండిగిన్నెలా తళతళా మెరిసింది.

ఎండంటే సుందరానికి ఎంతో ఇష్టం. కాని, ఎండని సరిగ్గా చూడ్డానికి ఆపిల్లకి ఎప్పుడోకాని అవకాశం ఉండదు. శారదమ్మ ఊళ్ళోకి పోకపోతే ఆవిడకి దినం గడవదు. అంచేత, సుందరం ఇంటిపట్టునే ఉండితీరాలి. ఇంటికి కాపలా ఉండి, చెల్లెల్ని చూసుకోవాలి. అన్నయ్య ఎక్కడికీ పారిపోకుండా కాసుకోవాలి. వాళ్ళుండే గదివెనక కొండదాకా ఉన్న పాతమామిడితోట ఎప్పుడూ చీకటిగా ఉంటుంది. నాలుగైదేళ్ళయి ఆతోట పూతాకేదు, కాపూలేదు. ఎవరగాఉన్న రోడ్డుకూడా రెండువైపుల్నించీ ఎత్తుగా దట్టంగా కమ్ముకున్న చెట్లతో అదో పొడవాటి గుహలా ఉంటుంది. సుందరం ఉండే పాతగదికి వీధి వైపుకి ఒక్క గుమ్మంతప్ప కిటికీల్లేవు. గదంతా చాలా చీకటిగా ఉంటుంది. గదికి ఎదురుగా కొంచెంపక్కగా ఉన్న పాతమర్రి చెట్టు, దగ్గిరకొచ్చిన వాళ్ళని ఊడల్లాటి చేతుల్తో బుమ్మల్చుట్టేసి తినేస్తూ కాలం గడిపేసే కదల్లేని ముసిలిరాక్షసిలా చీకటిగా భయంకరంగా ఉంటుంది. కిందనున్న గదిలోకి ఒక్కచుక్కయినా రానీకుండా ఎక్కళ్ళేని ఎండనీ అదే మింగేస్తుంది. తాగేస్తుంది. ఇంట్లోకి ఎండ ఎంతగారాదో అంతగా ఎండకావాలి సుందరానికి.

చుట్టుపక్కల మైలుదూరంలో ఎక్కడా ఇళ్ళులేవు. రోడ్డుమీద జనసంచారంకూడా అట్టేఉండదు. అమ్మ లేనప్పుడు వీధి గుమ్మంలో చెల్లెల్ని పక్కనకూర్చోబెట్టుకొని బితుకూ బితుకూ కూర్చుంటుంది సుందరం. ఆ పిల్ల ముఖంలో స్పష్టంగా కనిపించేవికళ్ళే. మర్రిచెట్టుకి చాలా అవతల మిగిలిపోయిన ఎండ ఆ కళ్ళల్లో బలహీనంగా మెరుస్తుంది. ఆ పిల్ల నోరు, చలిగాలికి ముణుచుకు పోయిన గులాబి మొగ్గలా, చాలా చిన్నదిగా ఉంటుంది. గట్టిగా గెంతినా నవ్వినా ఆమెకి దగ్గొస్తూంటుంది. ప్రాణంతోఉన్న సుందరానికి నీడగాపడిన సుందరంలా ఉంటుంది సుందరం. అందుకే ఆ పిల్లని చూస్తూ చూస్తూ 'ఈనీడ ఎప్పుడు మాయమైపోతుందో'నని శారదమ్మ అప్పుడప్పుడు భయపడుతూ ఉంటుంది.

వర్షంపడిన మూడ్రోజులూ ఎక్కడకీ పోకుండా శారదమ్మ ఇంటిపట్టునే ఉండిపోయింది. సుందరానికి అది కొంతనయం అనిపించింది. కాని ఆమెకి భయం మాత్రం లోజ్వరంలా అలా ఉంటూనే ఉంది. ఇవాళ వర్షం వెళ్ళేదు. రేపు ఎండ రావా అనుకొంది సుందరం. ఆకాశంలో మబ్బులు కొత్త బలాన్ని తెచ్చుకొంటున్నాయని ఆ పిల్ల గ్రహిం

ఒకోలేదు. కాని, ఆకాశం వైపు చూస్తేమాత్రం ఆమెకి బెంగ తగ్గడం లేదు.

"అమ్మా! అమ్మా! ఎప్పుడొస్తుందమ్మా ఎండా?" అంటూ తల్లి భుజం పట్టుకుఊపుతూ మళ్ళీ అడిగింది. సుందరం.

"రేపు రావొచ్చు తల్లీ!" అంది శారదమ్మ చిమ్నీ నెమ్మదిగా తుడుస్తూనే.

"ఎండొస్తుందామ్మా?!!"

"ఎందుకు రా తల్లీ?!"

శారదమ్మ అలా అనగానే సుందరం ఎగిరి గంతేసి. తల్లి పక్కనే కూర్చున్న నాలుగేళ్ళ చెల్లెలు సరూతో. "చెల్లీ! చెల్లీ! రేపు ఎండొస్తుందిటే. ఎండ!! మనంచేత దేవుడికి దండం పెట్టిమ్మా!" అంది.

సరూ, గౌనులేకుండా లాగుమాత్రం తొడుక్కొని బుద్ధిగా అమ్మ పక్క మఠం వేసుక్కూర్చుంది. అక్కమాట వినగానే ఆ పిల్ల ఏపి వైపు తిరిగి ముద్దుగా ఓ దండం పెట్టింది. సుందరం, చెల్లెల్ని ముద్దాడి, అక్కణ్నించి గదిలోకి పరిగెట్టి. ఆ చీకట్లో గోడవార కర్రపెట్టెమీద కూర్చున్న అన్నదగ్గరకెళ్ళి, "అన్నా ఒరే! ఎండరా ఎండ! ఎండ రేపొస్తుందిట!", అంటూ సంతోషంతో కేకలు వేసింది.

అన్న-అంజిగాడు- సుందరంకంటె రెండేళ్లు పెద్ద. వాడికి కాళ్లూ చేతులూ వళ్ళూ పెద్దవిగా ఉంటాయి; తలమాత్రం గుళ్ళో చెంబులా చిన్నదిగా ఉంటుంది. వాడు ఎండా నీడా అంటే తెలుసుకోలేడు; రాత్రో పగలో చెప్పలేడు; నిన్నా రేపూ అంటే అర్థంచేసుకోలేడు; అన్నం కలుపుకు తినలేడు. వాడికి మాటలు రావు. వాడు వెర్రివాడు. వాడెప్పుడూ ఆ కర్ర పెట్టెమీదే కూర్చుంటాడు; లేపోతే దాని మీదే పడుకుంటాడు. ఎప్పుడూ నోట్లో వేలు పెట్టుకు కనిపిస్తాడు.

చెల్లెలి కేకలికి భయపడి అంజిగాడు నోట్లోంచి వేలు తీసేసి, "ఏఏఏ" అంటూ కోపంతో కొట్టవచ్చినట్టుగా అరిచేడు. ఆ తరువాత చాలా కోపంగా నోట్లో వేలు పెట్టుక్కూర్చున్నాడు. సుందరం మాత్రం గెంతుకుంటూ తడిపరికిణీ పర పరలాడించుకొంటూ సరూ దగ్గర కొచ్చి, "లేవే సరూ! రేపు ఎండొచ్చేదాకా ఆడుకుందాం రావే!" అంటూ చెల్లెల్ని చెయ్యిపట్టుకు లేవదీసింది. ఇద్దరూ రయ్యిమంటూ నడవమీంచి వాకిట్లోకి గెంతి. అక్కడ నిలవనీళ్ళల్లో. చప్పట్లు కొడుతూ. ఆట్లాం మొదలుపెట్టేరు.

"ఎండొస్తుంది. రేపు ఎండొస్తుంది! నెమలికన్నులా. వెండి గిన్నెలా ఎండొస్తుంది! ఎంతో చక్కని ఎండొస్తుంది!" అంటూ సుందరం పాడేపాట శారదమ్మ చెవిలో పడుతోందే కాని, ఆవిడ అదేదీ సరిగా వినటంలేదు.

లాంతరుముందు కూర్చొని శారదమ్మ భగవంతుణ్ణే అగ్గిపుల్ల వెలిగించమని ప్రార్థిస్తోంది.

శారదమ్మకి దేవుడియెడల భక్తెక్కువ. ఎన్నివిషయాల్లో భగవంతుడామెన్ని ఎంత ఎడం పెట్టినా, ఆవిడమాత్రం ఆయన ముంగిటనుండి కదలకుండా మొండిగా కూర్చుంది ఏడాదికిందట. ఆవిడ పెనిమిటి తను పనిచేసే మిల్లు తాలుకు లేబరు వ్యవహారాల్లోకి కూలివాళ్ళ తరపున దిగి; తగువుల్లో ఇరుక్కొని దెబ్బలాటల్లో చిక్కుకొని. ఖూనీకేసులోకి అక్రమంగా ఈడవబడి. యావజ్జీవ కారాగారవాసశిక్ష అనుభవించటానికి వెళ్ళినప్పుడుమాత్రం ఆమెకి దేవుడంటే కొంచెం - అతికొంచెం చిరుకోపం వచ్చింది. పెనిమిటికి శిక్షపడినరాటి రాత్రి ఆమె తన చీకటిగదిలో కూర్చొని. అంతకుముందల్లా ఎంత దీనంగా దేవుణ్ని ప్రార్థించిందో. ఎన్నిసార్లు ఆ దీనరక్షకుడిముందు భక్తితో మోకరిల్లి ఎన్ని కష్టాలనుండి కాపాడమని ఎంతగా వలవల ఏడ్చిందో తల్చుకొని. తీరని దుఃఖంతో ఉప్పెనగా ఏడ్చింది. "మీ అల్లుడు చావు బతుకులమధ్య ఉన్నారు. మందు కావాలంటే చేతిలో చిల్లిగవ్వలేదు; పిల్లలకి తిండిపెట్టాలంటే ఇంట్లో చీకటితప్ప ఇంకేంలేదు; నా కెక్కడా ఎవరూ సహాయంలేరు; మాయందు దయుంచి ఒక్కసారి రా నాన్నా!" అంటూ ఎందరి చేత ఎన్ని కబుర్లు పంపినా. ఏడుస్తూ ఎన్ని ఉత్తరాలు రాసినా. భయపడి గుండె బేజారెత్తిపోయి ఎన్ని అర్జంటు టెలిగ్రాములుకొట్టినా ఎంతకీ రానట్టి డబ్బుగల తండ్రిమీద పేదింటికోడలైన ఆడకూతురికి కోపంవచ్చి అలిగినట్టు ఆమె ఆ రాత్రి భగవంతుడిమీద కోపం తెచ్చుకుని అలిగింది. కాని. ఆ కోపంలో కాఠిన్యంలేదు. ఆ అలగడంలో కల్మషంలేదు. మర్నాటి కల్లా ఆమె సర్దుకొంది. భగవంతుడున్నాడు కాబట్టే. అతనెంతో మంచివాడు కాబట్టే తన పెనిమిటికి ఉరి శిక్ష తప్పించి జెయిలుశిక్ష వేయించేడు. ఇంత పనికిరాని తుచ్ఛజీవి ఏడుపువిని ఈ నిర్భాగ్యురాలియెడల భగవంతుడు అపాటి దయ చూపించడం అదెంతకాదు!! మరో పదేళ్ళలో తన పెనిమిట్ని దేవుడే మళ్ళీ తనకి ఇచ్చేస్తాడు. "అబద్ధం కేసులో ఎందుకు ఇరికించేవు? అన్యాయంగా శిక్ష ఎందుకు వేయించేవు?" అని అడగడానికి తనెవరు. తనేపాటిది? ఆ దయామయుడికి ఏం తోస్తే అది చేస్తాడు; లేకపోతే. చెయ్యకపోతాడు; అనాయకుల్ని రంపపు కోత కోస్తాడు; నిర్భాగ్యుల్ని నాశనం చేస్తాడు; అసహాయుల్ని హతమారుస్తాడు. అదంతా అతని ఇష్టం అతనిలీల. ప్రార్థించడమే మనపని కాని రక్షించమని ఆ మహానుభావుణ్ని బలవంత పెట్టడానికి మన మెవరం?–

అని సమాధాన పర్చేసుకొంది శారదమ్మ.

"అమ్మా అమ్మా! ఆకాశం అంతా మబ్బుగా మన మర్రిచెట్టులా ఉందమ్మా! ఎండ నిజంగా రేపొస్తుందా అమ్మా?" అంటూ అనుమానంతో నడవలోకివచ్చి అమ్మని మళ్లీ భయం భయం భయంగా అడిగింది. సుందరం.

"దేవుడి దయుంటే వస్తుందమ్మా". అంది శారదమ్మ.

ఆవిడ రాత్రికి దీపం సంపాదించడం గొడవలో మునిగిపోయింది. లాంతరు వెలిగిద్దామంటే అగ్గిపెట్టె బాగా నానిపోయింది. పుల్లలు చూస్తే మూడే ఉన్నాయి. అందులో రెండప్పుడే వెలక్కుండా ఒట్టిపోయి విరిగిపోయేయి. మూడోది-దేవుడి దయుంటే వెలుగుతుంది. లేకపోతే లేదు.

లేదు. ఈరోజుకి దేవుడికి శారదమ్మ యెడల దయలేదు. ఈ రాత్రికి ఈఇల్లంతా చీకట్లో ఉండవలసిందనే అతని అభిప్రాయం. అందుచేత. చీకటి మరీ ఎక్కువవకుండా పిల్లలకి అన్నాలు పెట్టేస్తే. అందరూ పేగిరం కళ్లు మూసుకు పడుకోవచ్చు. తెలివున్నంతసేపే కాని తెలివి తప్పిపోయేక దీపముడన్నా ఒకటే. లేక పోయినా ఒకటే-చచ్చిన

వాళ్ళకి సౌఖ్యాలక్కర్లేనట్టు.

కాని, దీపం లేకపోతే పిల్లలు మధ్య మధ్య నిద్రలేచినప్పుడు భయపడి జడుసుకొంటారేమోనని శారదమ్మ భయపడుతోంది. అందులో ఊరవతల పాడుగదిలో నెయ్యాలమ్రకింద కాపరమాయె!

అయినా ఇటువంటివాటి గురించి మనం ఏమీ అనుకోకూడదు, చింతించకూడదు. కించపడకూడదు. ఈ పాడుపడిన గది దొరకడమైనా అదెంతకాదు?! పాతమొఖాసాదార్ గారి భార్యకి తమయెడల భగవంతుడి దయవల్ల — కరుణ కలగబట్టి ఇందులో ఈపాటి తలదాచుకోనిచ్చింది. వారానికి వంద అప్పడాలు పుచ్చుకోడం తప్ప. అద్దిచ్చినా పుచ్చుకోంది కాదు. గొప్పవారిలో డబ్బున్నవారిలో పెట్టిపుట్టిన మహారాజుల బిడ్డల్లో వెయ్యి మందిలో ఏ ఒక్కరికైనా బీదవెధవల మీదా, పేనముండల యెడలా ఆపాటి చిన్నపిసరు కరుణ కలగడం — అదికూడా భగవంతుడి దయవల్ల కాకపోతే ఇంకేమిటి?! ఆ వెయ్యిమందిలో ఆ ఒక్కరికైనా అంతపాటి కరుణయినా కలక్కపోతే నువ్వూ నేనూ శారదమ్మా చెయ్యగలిగిందేముంది?!

"అమ్మా! గదిలో చాలా చీకటిగా ఉందమ్మా!" అంది సుందరం.

"అవును తల్లీ!" అంది శారదమ్మ.

"మరైతే నడవలో భోంచెయ్యవా అమ్మా?"

"అలాగే తల్లీ!"

రెండుపూట్లా వంటచేసి పిల్లలకి కాస్త వేదన్నం రెండుపూట్లా పెడదామంటే ఈవర్షంవల్ల ఎక్కడా ఓ కాణీ అయినా పుట్టకుండా ఉంది. వర్షాలవల్ల కూరా నారా దొరకని ఈరోజుల్లో అప్పడాలూ వడియాలూ పేరయ్య కొట్టుమీద వేడివేడి పకోడీల్లాగ జోరుజోరుగా చెల్లిపోను. కాని ఏం చేస్తాం? ఇంట్లో పిండిలేదు. ఎండ లేదు.

"అమ్మా! కంచా లేసుకున్నాం. అన్నంపెట్టమ్మా!" అంది సుందరం.

మధ్యాహ్నం భోజనాలవగా మిగిలిన అన్నం వీధి వరండాలోకి గిన్నెతో పట్టుకొచ్చింది శారదమ్మ.

"అటు చూడమ్మా! ఎంత చీకటిగా ఉందో!" అంది సుందరం.

ఆకాశంకేసి చూసేసరికి శారదమ్మకి నిజంగా చాలా భయం వేసింది. అలలు చచ్చిపోయి, కారునల్లగా నలుపెక్కిపోయి గడ్డకట్టుకుపోయి, ఏక్షణాన్నయినా ఫెళ ఫెళా మనమీదికి విరుచుకు పడిపోయే విష సముద్రంలా ఉంది ఆకాశం. బుసలు కొడుతూ విషసర్పాలు దిగినట్టు రాత్రల్లా పడుతుంది వర్షం! తప్పదు మరింక!

"అమ్మా! అలా చూస్తున్నావేంటమ్మా? ఎండ రేపు రాదా?" అని అడిగింది సుందరం.

"ఏమోనమ్మా? ముందు మీరంతా భోంచేసి వేగిరం పడుకోండి!"

"ఎండరాదేంటమ్మా?" అని మళ్ళీ అడిగిన సుందరంకళ్ళల్లో నీళ్ళు తిరిగేయి. అమ్మ ముఖంలో ఎండ రేపొచ్చే సూచన్లు కనిపించలేదాపిల్లకి.

"ఎందుకమ్మా నీకా బెంగ? ఎండ తప్పక రేపొస్తుంది...ముందు భోంచెయ్యి, బెంగపెట్టుకోక!" అంది శారదమ్మ.

"నేను భోంచెయ్యనమ్మా!"

"అల్లరి చెయ్యకమ్మా, సుందరం!"

"రేపు ఎండొస్తుందా?"

"ఒస్తుంది. భోంచెయ్యి."

"నా న్నొస్తాడన్నావు. రానేలేదు. నువ్విలాగే ఉత్తుత్తి మాటల్చెప్తావమ్మా."

"మనచేతుల్లో ఏముందమ్మా? దేవుడికి దయకలగాలి; నాన్న రావాలి."

"దేవుడికి దయెప్పుడు కలుగుతుందమ్మా?"

"కలుగుతుంది తల్లీ! బెంగపడక భోంచెయ్యి!" అంది శారదమ్మ.

అంతలో సరూ. "అమ్మా అగ్గి! అమ్మా! అగ్గి!" అని కేకలు వేసింది,

చూస్తే, అవి చీమలు, మూడు కంచాల్లోనూ ఉన్న అన్నాలనిండా చిన్న ఎర్రచీమలు వందలు వందలు పాకుతున్నాయి. మూత సరిగాలేక అన్నం గిన్నె చీమలు పట్టేసింది. శారదమ్మకి ఏంచెయ్యాలో పాలుపోక అలా చూస్తూ నిల్చుంది. అంతలో ఆవిడ వెర్రికొడుకు వీధివైపు చెయ్యి చూపిస్తూ. "ఆ ఆ ఆ! ఏ ఏ!" అని వెర్రినవ్వు నవ్వుతూ కేకలు వేసేడు.

వీధిలో సుమారు రెండువందలమంది ముష్టివాళ్ళు గోనెలూ జోలెలూ దొక్కులూ కుండలూ కంపలూ పట్టుకొని మోసుకొని తొందర తొందరగా ఊరివైపుకి నడుచుకు పోతున్నారు. వాళ్ళంతా శారదమ్మ కాపరం ఉండే గదికి కొంతదూరంలో ఉండే సాధూమఠంలో ఉంటూంటారు. ఇవాళ. పొద్దున్న కాబోలు, మఠం గోడొకటి వర్షానికి నానిపోయి కూలి పోయిందన్నారు. రాత్రికివర్షం తిరిగివచ్చే సూచన్లు చూసి వాళ్ళంతా మరెక్కడైనా తలదాచుకొందికి పోతున్నట్టున్నారు. పొట్టవాళ్ళు, కుంటివాళ్లు, గుడ్డివాళ్ళు, జబ్బువాళ్ళు, ఆడ, మగ, ముసిలి, పడుచు (1) పిల్లవాళ్ళు అంతాకలిసి వర్షించే పెత్తనంలా ఘోషపెట్టుకు పోతున్నారు. విడివిడిగా చూస్తే వాళ్ళందరూ కూడా, వర్షంలో, కాలడానికి తడి కర్రలయినా దొరక్క, మరింక కుళ్ళి కుళ్ళి ఇలాగే ఉండిపోవాలేమోననే భయంతో బెదురుతో గాభరాగా కర్రలకోసం వెతుక్కొంటూ పరిగెత్తే నిన్నటి శవాల్లా ఉన్నారు.

వాళ్ళనలా చూస్తూ శారదమ్మ మౌనంగా నిల్చుండి పోయింది; సరూ సుందరాలు మౌనంగా కూర్చుండిపోయేరు. వెర్రిపిల్లడు మాత్రం వాళ్ళనిచూస్తూ సంతోషిస్తూ, వాళ్ళు దృష్టిపథంనించి దాటిపోయేదాక్కా చెయ్యి అటువైపే చూపిస్తూ నవ్వుకొంటూ కూర్చున్నాడు,

"అమ్మా! వాళ్ళెందుకమ్మా అలా పారిపోతున్నారు?" అని అడిగింది సుందరం.

"భయంచేత అలా పారిపోతున్నారమ్మా."

"ఎందుకమ్మా వాళ్ళకి భయం?"

"వాళ్ళ బతుకులికి ఎండలేదమ్మా! అందుకూ భయం!"

"మరి, మనకి ఎండ ఉంటుందా అమ్మా!"

"దేవుడికి దయుంటే అందరికీ ఉంటుంది తల్లీ!"

"దేవుడికి మనందరిమీదా కోపమా అమ్మా?"

"వేత్తల్లీ!" అంది శారదమ్మ.

దేవుడికి మనమీద దయలేకో లేక కోపంలేదో తెలీక సుందరం తికమకపడ్డాడు. శారదమ్మ మూకుడంలోవున్న అన్నం, మళ్ళీ, గిన్నెల్లోకి ఎత్తి. మూకుడుపొద్దు నీళ్ళతోకరగ్గా చీమలన్నీ తేలిపోయాయి. తేలిపోవటంకాదు ఎన్నిచీమలు చచ్చిపోయేయో ఏమిటో అని శారదమ్మ చాలా బాధపడింది. పిల్లలకి అన్నం పెట్టడంకోసం చీమలకడుపు కొట్టవలసివచ్చిందనేసరికి ఆమెక్కెందుకో కాని కడుపులో దేవేసినట్టయింది.

తడి అన్నంలో మజ్జిగనీళ్ళు వేసి ముగ్గురు పిల్లలచేతా శారదమ్మ భోజనాలు చేయిస్తూండగా వర్షం యథాప్రకారం నిన్నా మొన్నా అటు మొన్నట్లాగే పట్టుకొంది. వర్షాన్నిచూసి సుందరం బిక్క చచ్చిపోయింది: సరూ ఏడవడం మొదలెట్టింది. వెర్రివాడు మాత్రం అన్నం తినిపిస్తున్న తల్లిచెయ్యితోసేసి. వర్షాన్నిచూస్తూ సంతోషిస్తూ వెర్రికేకలు వేసి నవ్వడం ప్రారంభించేడు.

పిల్లల భోజనాలయ్యాక, శారదమ్మ గిన్నె కంచాలు కడిగేసి గదిలోకి వెళ్ళిపోయిన పిల్లల్ని బుద్ధిగా పడుకోమన్చెప్పికేక వేసింది. వర్షం చాలా జోరుగా తెగ జోరుగా పడుతోంది. వర్షం చేసేచప్పుడికి, కేకలు వేస్తేగాని నడవలో మాట గదిలోకి వినిపించడంలేదు.

వెర్రిపిల్లడు నోట్లో వేలు పెట్టుకుని గోడవార కర్రపెట్టెమీద ముణుచుకు పడుక్కున్నాడు. ఆ పిల్లడిమీద తడిపూర్తిగా ఆరని పాతచీరె మడతలు పెట్టి కప్పింది శారదమ్మ. మరోవార పొట్టిమడతమంచంమీద సరూ సుందరాలు తడారని పాతబొంత కప్పుకు పడుకున్నారు. గదంతా యథాప్రకారం కురవడం ప్రారంభించింది. చూరునుంచి కిందికి పడే నీటిబొట్లు చేసే చప్పుడు చావు చప్పుడులాఉంది. పైన వర్షపు హోరు అదేదో రాక్షస రాజ్యంలో ప్రజలందరి ఘోషలాఉంది.

బాగా చీకటిపడి గంటే అయిందో, రెండుగంటలే అయిందో, శారదమ్మ తడిపైటని గుండెలమీదకి తెచ్చుకు కప్పుకొని, చలికి పైటలో చేతులు ముణుచుకు దాచుకొని, నడవపక్క వీధిగుమ్మానికి చేర్లబడి ఏదో ఆలోచిస్తూ కూర్చుంది. ఆమెకి నిద్రరావడంలేదు. వర్షంలోకి, అలా రెప్ప వెయ్యలేకుండా అదేపనిగా చూస్తూ ఆలోచిస్తోంది.

చీకట్లో వర్షధారలు చాలా అస్పష్టంగా కనిపించడంచేత ఆకాశానికీ భూమికీ మధ్య నీరుతప్ప మరేంఉన్నట్టు అనిపించడంలేదు నీటిధాటికి గాలిగాలంతా కూడా అదిరిపోయి అణగారిపోయి ఎక్కడకో పారిపోయినట్టుంది. ఏ అడ్డూ లేకపోవడంతో వర్షించే పెనుమబ్బులన్నీ నీటితోనే భూమ్మీదకి దిగిపోయి ఆకాశమంత ఎత్తుకిలేచి అంత దళసరిగా ఉన్నట్టున్నాయి.

శారదమ్మ కళ్ళంట నీరు తిరగడం ఆ చీకట్లో కనిపించడం లేదు చీకట్లో కూడా చీకటినీడలా కనిపించే ఆవిణ్ని అక్కడ ఆసమయంలో చూస్తే, అమావాశ్యనాటి రాత్రి సముద్రం అట్టడుగున అణిగిపోయి ఒదిగి కూర్చున్న అదేదో వింత ప్రాణిలా కనిపిస్తోందే కాని మనిషిలా కనిపించడం లేదు.

తన మట్టుకు తనకి, శారదమ్మకి, తనెక్కడో ఏదో లోతు తెలీకని సముద్రం లోపల గులకరాళ్ళ గుహలో తేలలేక కూలబడి కూర్చున్న రీతిగానే తోస్తోంది. ఎంతటి ప్రకాశవంతమైన సూర్యరశ్మయినా ఇంత లోతు నీటిలోకి ఇంత లోతుకి దిగదు, దిగజాలదు. ఈ మహాసముద్రపు విషపు నీటి అట్టడుక్కి ఏ యెండా, ఏ వెలుగూ ఎన్నటికీ రాదు, రాజాలదు. ఈ శారదమ్మ మరింక భూమ్మీదికి తేలడానికి ఏ అవకాశం అయినా సరే ఎక్కడా లేదు, ఉండదు. ఉండబోదు.

ఆ సమయంలో శారదమ్మకి—ఎండ లేని తన బాల్యం, చలికాలపు సాయంకాలపు ఎండలాంటి తన యవ్వనం, నీ రెండయినా చొరని రాతిగోడల మధ్య ఇరుక్కున్న తన పెనిమిటి రూపం. మెదడంతా చీకటితో నిండిన తన వెర్రికొడుకు జీవితం, ఎండకోసం పాకులాడుతూ తనతోపాటు ఈ సముద్రపు అట్టడుగున, సముద్రమంత బరువు కింద, ఈ చీకటి నీట్లో ఈదలేక తేలలేక చావలేక ఉక్కిరి బిక్కిరయి కొట్టుమిట్టాడే తన అతిచిన్న ఆడపిల్లల ఘోర పరితాపం అన్నీ గుర్తుకొచ్చి ఆమెని కుంగదీసి కలచివేయగా ఆమె కళ్ళంట జారిన కన్నీళ్ళు నడవలో రాతిగచ్చుమీదపడి, అక్కడ కురుస్తున్న నీటితో కలిసి వాకిట్లోకి కుంటుకొంటూ పోయి, అక్కణ్నుంచి రోడ్డుమీదికి తేలి, అక్కణ్నుంచి కాలవలోకి దూకి ఆ రాత్రి ఆ చీకట్లో ఆ వర్షంలో ఎక్కడో ఏ చీకటి సముద్రంలోకో కాని కొట్టుకు కొట్టుకుపోయి కలిసిపోయేయి.

వెర్రిపిల్లడు కర్రపెట్టెమీద వింత జంతువులా పడుక్కున్నాడు. "ఎండంతా చచ్చిపోయిందటే అక్కా? నిజం చెప్పవే!" అంటూ వెక్కి వెక్కి ఏడ్చిన సరూ చివరకి నిద్దరనే చీకట్లో మెల్లి మెల్లిగా కలిసిపోయింది. పిల్లల ఏడుపు వినిపిస్తే రాక్షసులొచ్చి పిల్లల్ని ఎత్తుకుపోతారని సుందరాన్ని ఎప్పుడో ఎవరో జడిపించేరు. ఆ జడుపు ఇప్పటికీ ఆమెని వదల్లేదు. అందుచేత, రాక్షసులెవరికీ వినిపించకుండా, బెంగతో బాధతో చెప్పజాలని ఆవేదనతో ఆ రాత్రి అతి రహస్యంగా ఏడ్చి ఏడ్చి అలిసలిసిపోయిన సుందరాన్ని చూసిచూసి మరింక చూడలేక దయదల్చిన చావులాంటి నిద్ర, ఆ పిల్ల కప్పుకున్న తడిబొంతలా, ఆఖరికెలాగైతేనేం ఆమెని అతిచల్లగా కప్పింది.

చీకట్లో తెరిపిలేకుండా పడే వర్షం, కళ్ళులేని గుండెలేని కారునల్లని గీతల గీతల భూతంలా ఉంది.

"అవును నాకు రాయాలనే వుంది.

నాకు ఈ ప్రభువుల్ని ఈడ్చి ఎండబెట్టాలని ఉంది; వారి గుమాస్తాలని గుద్ది కూర్చోబెట్టాలని వుంది; కూలి కులాలన్నీ ఏకం కావాలని ఉంది. పచ్చడి మెతుకులూ దేవతా వస్త్రాలూ మాత్రమే వారికి పరమార్థం కాకూడదని వుంది.

నాకు రాయాలనివుంది. ఎందుకంటే

నీతుల బంగారాన్ని తవ్వి తీయవలసి వుంది. కొండలమీద కోటల్ని కూల్చవలసి వుంది. బ్రహ్మచెముడు డొంకల్ని దుంప నాశనం చెయ్యవలసి వుంది. అక్షర అజ్ఞానాన్ని తన్ని తోసేయవలసి వుంది. పాలకుల బందూకుల ప్రాణాల్ని జనసేన చేయవలసివుంది."